నమస్తే తెలంగాణ

ఖమ్మం

3 | ఖమ్మం, గురువారం 29 ఫిబ్రవరి 2024 | KHAMMAM


# సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

**ఖమ్మం సీపీ సునీల్ దత్**



సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ సునీల్ దత్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 28 : నేరాల గుర్తింపు విషయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) మరింత సమర్థవంతంగా పని చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. బుధవారం నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ.. నేరాలు, దొంగతనాలు, దోపిడీలు తదితరాలను గుర్తించడంలో దర్యాప్తు అధికారులకు అందిస్తున్న సహాయాన్ని, పాత నేరస్థుల కదలికలకు సంబంధించి ముందస్తు సమాచార సేకరణలో సీసీఎస్ పోలీసుల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల ఛేదనలో కీలకంగా వ్యవహరించే సీసీఎస్‌ను పటిష్ఠ పరిచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. అంతేకాక ప్రాపర్టీ రికవరీపై సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ రకాలైన నేరాల అదుపునకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## భూ సేకరణపై దృష్టి సారించండి

**కలెక్టర్ ప్రియాంక ఆల**



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్, ఇరిగేషన్, సింగరేణి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ మూడు దశల ప్రాజెక్టులకు భూసేకరణ, పులుసుబొంత ప్రాజెక్టు, బీటీపీఎస్ రైల్వే లైన్, మణుగూరు, కరకగూడెం గ్రామాల ఆర్‌అండ్‌ఆర్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, తదితర సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పులుసుబొంత ప్రాజెక్టు భూసేకరణకు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించి వారం రోజుల్లో ఆర్డీవోకు నివేదిక అందజేయాలని కరకగూడెం తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రవీంద్రనాథ్, బీటీపీఎస్ సీఈ బిచ్చన్న, ఇరిగేషన్ ఈఈ అర్జున్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, నేషనల్ హైవే ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు షురూ

- ఖమ్మం జిల్లాలో 70, భద్రాద్రి జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు
- ఉభయ జిల్లాలు కలిపి 1,838 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక
- అమలులో నిమిషం నిబంధన..
- ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన పలువురు విద్యార్థులు



ఖమ్మం ఎడ్యుకేషన్: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఖమ్మం ఎడ్యుకేషన్: పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్





కొత్తగూడెం ఎడ్యుకేషన్: పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



కొత్తగూడెంలో విద్యార్థుల తనిఖీ







ఖమ్మం ఎడ్యుకేషన్/కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 28: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్ విద్యార్థులు తెలుగు/సంస్కృతం/హిందీ పరీక్ష రాశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పరీక్షా సమయానికి ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ముద్దాడుతూ 'ఆల్ ది బెస్ట్' చెప్పి కేంద్రాల్లోకి పంపించారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ బోర్డు 70 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటి పరిధిలో 19,499 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 900 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 16,919 మందికి 16,286 మంది, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న వారిలో 2,580 మందికి 2,313 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు 'ఏ' సెట్ ప్రశ్నాపత్రం ఎంపికైంది. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు జూనియర్ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలను హై పవర్ కమిటీ, డీఈసీ బృందాలు, ఫ్లయింగ్ స్కాడ్ బృందాలు, సిట్టింగ్ స్కాడ్ బృందాలు 35 కళాశాలలను తనిఖీ చేశాయి. భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 36 కేంద్రాలు ఏర్పాటు కాగా 10,771 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉన్నది. తొలిరోజు పరీక్షకు 938 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 8,227 మందికి 7,828 మంది, ఒకేషనల్‌లో 2,544 మందికి 2,005 మంది హాజరయ్యారు. భద్రాద్రి జిల్లాలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజు, నోడల్ ఆఫీసర్ సులోచనారాణి తనిఖీ చేశారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

**స్పష్టంగా కనిపించిన నిర్లక్ష్యం..**

వేసవి దృష్ట్యా యాజమాన్యాలు పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించాయి. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్యారోగ్యశాఖ వైద్యసిబ్బందిని నియమించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాల్సి ఉండగా కొన్ని పరీక్షా కేంద్రాల్లోనే వైద్య సిబ్బంది అందుబాటు ఉన్నారు. ఖమ్మం జిల్లాకేంద్రంలో వైద్యసిబ్బంది జాడే లేదు. ప్రశ్నాపత్రాల తరలింపులో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు భద్రత నియమాలను మరిచారు. జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ, పోలీసుల భద్రత నడుమ కారులోనే ప్రశ్నాపత్రాలను తరలించాల్సి ఉండగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఖమ్మంలోని వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల నుంచి ప్రైవేటు వాహనాల ద్వారా ప్రశ్నాపత్రాలను తరలించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉన్నది.

**నిమిషం నిబంధనతో వెనుదిరిగిన విద్యార్థులు**

కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కాలేజీ కేంద్రానికి పావని, సింగరేణి పాఠశాల కేంద్రానికి సాయికుమార్, నలంద పరీక్షా కేంద్రానికి రూప, సిద్ధార్థ కేంద్రానికి హుస్సేన్ అనే విద్యార్థి పరీక్షా ప్రారంభ సమయం కంటే ఆలస్యంగా వచ్చారు. దీంతో అధికారులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మణికర్ణిక అనే దివ్యాంగురాలు రాసే పరీక్షకు దివ్య అనే విద్యార్థిని సహాయకురాలిగా వచ్చి పరీక్ష రాసింది.

**నేటి నుంచి ద్వితీయ సంవత్సర విద్యార్థులకు..**

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు గురువారం నుంచి పరీక్షలు రాయనున్నారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 70 కేంద్రాల్లో 18,097 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుంది.విద్యార్థులు bietelangana.cgg. gov. in అనే వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ఖమ్మం : పరీక్షా కేంద్రంలో తనిఖీలు



కొత్తగూడెంలో...



ఖమ్మంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

# హామీలన్నీ అమలు చేస్తాం

- అర్హులందరికీ త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- వాటితోపాటే రేషన్ కార్డులు, మహిళలకు రూ.2,500 కూడా..
- 'ధరణి'లో వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులను పరిష్కరిస్తాం
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 28 : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తిరుమలాయపాలెం మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. మాదిరిపురం వద్ద గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో రూ.5 కోట్లతో చేపట్టిన తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై మండలంలోని 30 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఇటీవలే మరో రెండు గ్యారెంటీలను ప్రారంభించామని అన్నారు. మిగిలిన గ్యారెంటీ హామీలను కూడా త్వరలోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, రేషన్ కార్డులు జారీ చేస్తామని వివరించారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం మహిళలకు రూ.2,500 పారితోషికాన్ని కూడా అందజేస్తామని అన్నారు. తనకు పదవులు, అధికారం శాశ్వతం కాదని అన్నారు. అవి ఉన్నా.. లేకున్నా తాను ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూనే ఉన్నానని అన్నారు. వారి మధ్యన ఉండడమే తమ అభిమతమని అన్నారు. అలాగే, ధరణి పోర్టల్‌లో వచ్చిన రెండు లక్షల నలభై ఐదు వేల దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల అభివృద్ధికి కూడా కృషి చేస్తానని మాటిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ వీపీ గౌతమ్, ఎంపీపీ బోడ మంగీలాల్, జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి, తిరుమలాయపాలెం సొసైటీ డైరెక్టర్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, మాజీ సర్పంచ్ బోడపట్ల సునీత, మద్దినేని స్వర్ణకుమారి, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

# 72 శాతమే పూర్తి..

- భద్రాద్రి జిల్లాలో రేషన్ కార్డుల ఈ-కేవైసీలో గందరగోళం
- వివరాలు సరిపోలని లబ్ధిదారుల డేటా అప్‌డేషన్ తప్పనిసరి
- మరోసారి గడువు పెంచినా ముందుకు కదలని కేవైసీ ప్రక్రియ
- నేటితో అది కూడా ముగుస్తుండడంతో లబ్ధిదారుల అయోమయం
- వివరాలు, వేలిముద్రల నమోదు కోసం ఆధార్ కేంద్రాలు కిటకిట



లబ్ధిదారుల నుంచి ఈ-కేవైసీ తీసుకుంటున్న రేషన్ డీలర్

చుంచుపల్లి, ఫిబ్రవరి 28 : రేషన్ కార్డుల ఈ-కేవైసీలో గందరగోళం నెలకొంటోంది. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం రేషన్ కార్డుల్లో పేరు ఉండడం తప్పనిసరి అని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో అనేకమంది అనర్హులున్నారని, పైగా కార్డులు కూడా దుర్వినియోగమవుతున్నాయని చెబుతూ అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే రేషన్‌కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియను చేపట్టింది. ఆధార్‌తో వాటిని అనుసంధానం చేస్తోంది. అయితే ఇక్కడే అసలు చిక్కు వచ్చి పడుతోంది. పలువురి లబ్ధిదారుల పేర్లు, ఇతర వివరాలు రేషన్‌కార్డు, ఆధార్ కార్డులో సరిపోలకపోవడం, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై లేకపోవడం వంటి కారణాలతో ఈ-కేవైసీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఆలస్యమవుతోంది. దీనికితోడు ప్రభుత్వం ఇంతకుముందే ఇచ్చిన గడువు పూర్తికావడంతో మరోసారి కూడా ఆ గడువు పెంచింది. ఇప్పుడు ఆ గడువు కూడా పూర్తి కావస్తుండడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఆధార్‌లో మార్పులు చేర్పుల కోసం ఆధార్ నమోదు కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇలాంటి లబ్ధిదారులతో ఆయా కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

**ఈ-కేవైసీ పూర్తయితేనే పథకాల వర్తింపు..**

రేషన్‌కార్డుల్లో పేరున్న వాళ్లు మాత్రమే సంక్షేమ పథకాలకు అర్హులని ప్రభుత్వం చెబుతోంది. పిల్లలకు ఆదాయ ధ్రువపత్రాలు సహా ఇతరత్రా సర్టిఫికెట్ల కోసం రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటోంది. అంతేకాక ఈ-కేవైసీ చేయని వారి పేర్లను రేషన్ కార్డుల్లోంచి తొలగిస్తారు. తాజా ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత ఎంతమంది పేర్లు రేషన్ కార్డుల్లో ఉంటాయో వారికే పథకాలు వర్తిస్తాయి. రేషన్ వస్తుంది. దీంతో లబ్ధిదారులు చౌక దుకాణాల్లోని డీలర్ల వద్ద తమ ఈ-కేవైసీని పూర్తి చేసుకుంటున్నారు. వివరాలు సరిపోలని వారు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

**జిల్లా మొత్తంలో 72.43 శాతమే పూర్తి..**

భద్రాద్రి జిల్లా మొత్తంలో 72.43 శాతం మంది మాత్రమే ఈ-కేవైసీని పూర్తి చేసుకున్నారు. ప్రత్యేకంగా చుంచుపల్లి మండలంలో పరిశీలిస్తే అది 64.71 శాతంగానే ఉంది. కొంతమంది వృద్ధులు, చిన్నపిల్లలు, ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారితోపాటు మరికొందరు వేలి ముద్రలు ఈ-కేవైసీ యంత్రంలో నమోదు కావడం లేదు. దీంతో వారంతా ఆధార్‌లో తమ వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది. ఈ కారణంగా ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జనాల తాకిడి పెరగడంతో ఆధార్ కేంద్రాల నిర్వాహకులు రోజుకు 15 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. కొన్నిచోట్ల టోకెన్ల కోసం తెల్లవారుజామున 3 గంటల నుంచే క్యూలో నిల్చుంటున్నారు. ఈ తతంగానికి రోజుల కొద్దీ సమయం పడుతుండడంతో రేషన్‌కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నెల 29 వరకూ ఇచ్చిన మరో గడువు కూడా ముగుస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంటోంది.

**రోజుల తరబడి తిరుగుతున్నా టోకెన్లు లభించట్లేదు..**

రేషన్ కార్డులో మా ఇద్దరి పిల్లల వివరాలు నమోదు కావడం లేదు. వారు చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు ఆధార్ దింపాం. ఇప్పుడు రేషన్ షాపులోని ఈ-కేవైసీకి వెళితే ఆ యంత్రంలో మా పిల్లల వేలిముద్రలు పడడం లేదు. దీంతో వారి వేలిముద్రలను ఆధార్‌లో అప్‌డేట్ చేయించాల్సి వచ్చింది. ఇందుకోసం ఆధార్ కేంద్రానికి వెళ్తే వాళ్లేమో టోకెన్లు అయిపోయాయని చెబుతున్నారు. రోజుకు 15 టోకెన్లే ఇస్తున్నారంట. వాటి కోసం తెల్లవారుజామున 4 గంటలకే వెళ్లాలంట. అయినా రోజుల తరబడి తిరుగుతున్నా టోకెన్లు లభించట్లేదు.

–ఇనగాల ఉమాదేవి, గృహిణి, రుద్రంపూర్

# నగరపాలక సంస్థ ఆదాయం ఆర్జించే విధంగా బడ్జెట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

**కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ**

**రూ.187.86 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం**

ఖమ్మం, ఫిబ్రవరి 28: ఖమ్మం నగరపాలక సంస్థ ఆదాయాన్ని ఆర్జించే విధంగా బడ్జెట్ రూపొందించినట్లు కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి పనులు జరిగి నగరం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. పారిశుధ్య కార్మికులు నిబద్ధతతో పనిచేసి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్పొరేషన్ నిధుల నుంచి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో 10 శాతం నిధులను గ్రీనరీకి వెచ్చిస్తామన్నారు. మున్సిపల్ పన్నుల వసూళ్లను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నగరంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రీనరీకి కేటాయించిన నిధులు ఆ పనులకే వినియోగించాలన్నారు. అద్దెల వసూళ్ల ద్వారా నగరపాలక సంస్థ ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. నగరంలో నీటి ఎద్దడికి తావు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరచాలన్నారు. అనంతరం కౌన్సిల్ 2024–25కు సంబంధించిన రూ.187.86 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఫాతిమా జొహరా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**కలెక్టర్ వీపీ గౌతమ్**

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 28 :ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించడంతోపాటు రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల కేంద్రాన్ని, ఆస్పత్రి థియేటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో వైద్య సేవల విస్తరణకు వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించామన్నారు. నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్యుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్